ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 , కనిష్ఠం : 23.0
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
సోమవారం 8 జూలై 2024



ప్రాజెక్టుల పురోగతిపై..
సీఎంకు నివేదిక



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ ; చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

- అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు సమీక్ష
- పాలమూరు-రంగారెడ్డిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- పీహెచ్‌సీలకు సిబ్బంది, మందులు సరఫరా చేయాలి
- విద్యా సంస్థల బలోపేతం, పర్యాటక అభివృద్ధికి చర్యలు
- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు
- మహబూబ్‌నగర్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్, జూలై 7: పాలమూరు-రంగారెడ్డితోపాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లా మరింత అభివృద్ధి చెందనుందని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఇరిగేషన్, విద్య, వైద్యం, టూరిజం, స్త్రీశక్తి అంశాలపై ఉమ్మడి జిల్లా అధికారులతో మూడు గంటలపాటు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా ఇంకా చాలా చర్యలు తీసుకోవాల్సి ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం, సిబ్బంది కేటాయింపు, మందుల సరఫరా జరగాలన్నారు. అదే విధంగా విద్య, వైద్య రంగాలలో మానవ వనరులను అభివృద్ధి చేసుకుంటేనే డెవలప్‌మెంట్ సాధ్యమవుతుందన్నారు. జాతీయ రహదారిపై ట్రామా సెంటర్ల ఏర్పాటు, పాఠశాలల్లో స్వీపర్ల నియామకం, విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నల్లమలతో పాటు పలు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టులకు కేటాయించిన నిధులెన్ని?, ఇప్పటివరకు ఎన్ని ఖర్చు చేశారు?.. ఏయే రిజర్వాయర్లు ఏ స్టేజిలో ఉన్నాయి.. ఇంకా ఎన్ని నిధులు అవసరమవుతాయి?.. పనుల్లో లోపాలు ఏమైనా ఉన్నాయా?.. పర్యావరణ అనుమతులు, విద్య, వైద్య పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యేలు, అధికారులతో చర్చించామని మంత్రి చెప్పారు. ఈనెల తొమ్మిదిన పాలమూరు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీటిపై యంత్రాంగంతో సమీక్ష చేయనున్నందున ఈ నివేదికను ముఖ్యమంత్రికి వివరిస్తామన్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కేవలం తాగు నీటి అవసరాల కోసమేనని నివేదిక ఇచ్చిందని చెప్పారు. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. పదేళ్ల క్రితం వేసిన ఎస్ఎస్ఆర్ రేట్లకు ఇప్పటికీ చాలా తేడా ఉందని, మరో రూ.30 నుంచి రూ.40 కోట్ల బడ్జెట్ కేటాయిస్తేనే ఈ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ముందుగా పాలమూరు అభివృద్ధిపై పాలసీ నిర్ణయాలు జరిగితే ఆ తరువాత నిధులు సమకూర్చుకోవచ్చన్నారు. శ్రీశైలం నుంచి జిల్లా ప్రాజెక్టులకు తీసుకోవాల్సినన్ని నీళ్లు తీసుకుంటే రాయలసీమ వాటా తగ్గుతుందన్నారు. డిండికి ఇచ్చే 0.5 టీఎంసీలను ఏదుల నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డిపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, కాళేశ్వరం తరహాలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేఎల్ఐలో ఉన్న ఐదు పంపులలో కొన్నేళ్లుగా మూడు పంప్‌లే రన్ అవుతున్నాయని, దీనివల్ల మూడు లక్షల ఎకరాలకు కూడా నీరు అందడం లేదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిన బడ్జెట్ ఎంత? ఇంకా ఎంత అవసరం ఉంది?, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు కావలసిన బడ్జెట్ ఎంత అనేది అధికారులు పూర్తి నివేదికను తయారుచేసి ఇవ్వాలన్నారు. తాము సీఎంకు నివేదించి, బడ్జెట్ కొరతా ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులకోసం తాను ఢిల్లీలో ప్రయత్నం చేస్తానన్నారు. అయితే అధికారులు ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం కోసం మంత్రులకు ఇచ్చిన బుక్కులలో తొంగిచూడాలా అని ప్రశ్నించారు.

డిసెంబర్ నాటికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించాలి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డిసెంబరు నాటికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆసుపత్రి పనులను మంత్రి ఆదివారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. నిర్మాణాలు, నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సూపర్ స్పెషాలిటీ 1,003 పడకలతో పాటు జనరల్ ఆసుపత్రిలోని ఎంసీహెచ్‌లో గల 220 పడకలు కలిపి 1223 పడకలు అవుతున్నందున అందుకు తగిన డాక్టర్లు, అదనపు సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరులో నేషనల్ ఇనిస్టిట్యూట్ కోసం సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిద్దామని చెప్పారు. ఇప్పటికే మహబూబ్‌నగర్, జడ్చర్ల పరిసరాల్లో 42 ఎకరాల స్థలం చూశామన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మాణం త్వరగా చేసి అక్కడ వసతులు, హెచ్ఆర్ కల్పిస్తే వైద్య పరంగా జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అద్దెకు ఇస్తే ఆ ఆదాయంతో ఆసుపత్రి రెగ్యులర్ మెయింటెనెన్స్‌కు ఇబ్బంది ఉండదన్నారు.
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ఉదండపూర్ రిజర్వాయర్ పనులు సగం కూడా చేపట్టలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలన్నారు. కర్వెన వరకే పనులు ఆపితే ఈ రిజర్వాయర్ ద్వారా మూడు లక్షల ఎకరాలకే నిరు ఇవ్వగలుగుతామని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్చర్లలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టినా స్టాఫ్, వసతులు కల్పించకపోడంతో పేదలకు వైద్యం అందక ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు.
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కర్వెన రిజర్వాయర్ నిర్మాణం చేపట్టినా పంట పొలాలలకు నీళ్లు వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ఎకరా పొలానికి నీరిచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కాలువల కోసం ఇప్పటివరకు భూసేకరణ జరగలేదన్నారు. హైవేలో ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఆత్మకూరులో పోస్ట్‌మార్టమ్‌లు పరద కట్టి బయటే నిర్వహిస్తున్నారని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా లేదని అన్నారు. కృష్ణానది తమ ప్రాంతం నుంచి వెళుతుందని, ఆ ప్రాంతంలో ముంపుగ్రామాల సమస్యపై దృష్టి సారించాలని కోరారు.
- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. లేబర్ గదులు లేవని, పరద కట్టి ఆపరేషన్‌లు చేస్తున్న పరిస్థితి ఉందని విచారం వెలిబుచ్చారు. మందులు కూడా సరఫరా కావడం లేదన్నారు.
- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం భూసేకరణ చేయకుండా ప్రాజెక్టులను చేపట్టిందని, ఇప్పుడు భూసేకరణ చేయాలంటే భూముల డిమాండ్ పెరిగిపోయిందన్నారు. వెంటనే భూసేకరణ చేసిన తరువాతనే ప్రాజెక్టుల పనులు చేపట్టాలని కోరారు. కేఎల్ఐ నుంచి 80 శాతం నీరు వృథాగా పోతోందని, ప్రతీ నియోజకవర్గంలో నాలుగు నుంచి ఐదు టీఎంల సామర్థ్యం గల రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.
- షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లిశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు ఒక్క రూపాయి కేటాయించకుండా దగా చేసిందన్నారు. ఈ ప్రభుత్వమైన తమను మోసం చేయకుండా పనులు చేపట్టాలన్నారు. భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు.
- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తిలో 50 పడకల ఆసుపత్రిని 100పడకల ఆసుపత్రిగా మార్చి స్టాఫ్‌ను కేటాయించాలని కోరారు. అనస్థీషియా పోస్టు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరచాలని, పీహెచ్‌సీలను బలోపేతం చేయాలని అన్నారు. ఆస్పత్రులలో మందుల కొరత తీర్చాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కలెక్టర్లు విజయేందిరబోయి, బదావత్ సంతోష్, ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్‌లు, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

పుష్కలంగా ఎరువులు

- మహబూబ్‌నగర్ జిల్లాకు అవసరమైన 54,104 మెట్రిక్ టన్నులు రెడీ
- బఫర్ స్టాకు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- పక్కదారి పట్టకుండా నిరంతరం పర్యవేక్షణ
- అందుబాటులో యూరియా



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి రైల్‌లో వచ్చిన ఎరువులను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు(ఫైల్)

పాలమూరు, జూలై 7: వానాకాలం సీజన్‌లో రైతులకు కావలసిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ చెబుతోంది. జిల్లాకు అవసరమైన 54,104 మెట్రిక్ టన్నుల ఎరువులను ఇప్పటికే బఫర్ స్టాక్ గోదాములకు తరలించామని తెలిపింది. గతేడాది వరకు అమల్లో ఉన్న విధానంపై సమీక్ష చేసి ఒకవైపు డీలర్లకు, మరోవైపు మార్క్‌ఫెడ్‌కు చెరిసగం ఎరువులు కేటాయించేలా శాఖ చర్యలు తీసుకుంది.

సమృద్ధిగా నిల్వలు

సరఫరాలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎరువుల కేటాయింపులపై వ్యవసాయ శాఖ ఈసారి కొన్ని మార్పులు చేసింది. గతేడాది వరకు ఎరువుల కేటాయింపుల్లో మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, డీలర్లకు 40 శాతం ఎరువులు అందించేవారు. అయితే రైతులకు ఎరువులు అందించే విషయంలో డీలర్ల వినియోగం ఎక్కువగా ఉండటం, మార్క్‌ఫెడ్‌కు కేటాయించిన నిల్వలు భారీగా పేరుకుపోతుండటంతో కేటాయింపులపై శాఖ సమీక్ష చేసింది. ఈ సీజన్ నుంచి మార్క్‌ఫెడ్‌కు 50 శాతం, డీలర్లకు 50 శాతం చొప్పున యూరియా, ఎరువులు అందించాలని నిర్ణయించింది. దాంతో రైతులకు కొనుగోళ్ల విషయంలో కొరత ఉండదని, అవసరమైనంత నచ్చిన చోట తీసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు గోదాంల సామర్థ్యం మేర నిల్వ ఉంచామని, అవి రైతులు తీసుకెళ్తుంటే మరింత స్టాకు తెప్పిస్తామని చెబుతున్నారు.

కొరత లేదు

ఎరువులను లక్ష్యం కంటే 30 శాతం అదనంగా అందుబాటులో ఉంచాము. ఈ ఏడాది 22 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమైతే ఇప్పటికే 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర ఎరువులు అందుబాటు(జిల్లాలో 54,104మెట్రిక్ టన్నుల ఎరువులు)లో ఉంచాం. యూరియా, ఎరువుల అమ్మకాలపై నిరంతరం ఏడీ, ఏఈవో, ఏవోల ద్వారా పర్యవేక్షణ చేయిస్తున్నాం. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. ఎంత కావాలన్నా అంత ఇవ్వటానికి అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

యూరియా పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ

వానాకాలంలో అత్యధికంగా వినియోగించే యూరియా పక్కదారి పట్టకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దుకాణాలు, సంఘాలకు యూరియా కేటాయింపులు జరిగాక, విక్రయాలపై నిరంతరం పరిశీలన ఉంచుతున్నారు. ఏవో, ఏడీలు తమ పరిధిలోని సంఘాలు, డీలర్ల అమ్మకాలను వారంలో ఒకసారి పరిశీలించి నిల్వలు సరిచూడాలని జిల్లా అధికారులు ఆదేశించారు. జిల్లా, డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఫిర్యాదులొస్తే తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.

జిల్లాలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు(మెట్రిక్ టన్నుల్లో..)

పేరు	అవసరం	అందుబాటులో ఉన్నది
యూరియా	22,000	23,500
డీఏపీ	9,800	4,101
కాంప్లెక్స్	26,000	25,441
ఎంవోపీ	1800	580
ఎస్ఎస్‌పీ	1260	482

బస్సు, బైక్ ఢీకొని..
అన్నదమ్ముల మృతి

- కోయిలకొండ మండలం బూర్గుపల్లిలో విషాదఛాయలు



ప్రమాదానికి కారణమైన బస్సు



లక్ష్మయ్య, మొగులయ్య(ఫైల్)

కోయిలకొండ, జూలై 7: స్వగ్రామం నుంచి బైక్‌పై మహబూబ్‌నగర్‌కు బయలు దేరిన అన్నాదమ్ములు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం, పారుపల్లి వద్ద ఆదివారం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోయిలకొండ మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన గొల్ల మొగులయ్య (44), గొల్ల లక్ష్మయ్య (32) మహబూబ్‌నగర్‌లో నివసిస్తూ, సెంట్రింగ్ మేస్త్రీలుగా పని చేస్తున్నారు. శనివారం స్వగ్రామానికి వచ్చిన వారిద్దరూ, ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్‌కు బయలు దేరారు. పారుపల్లి వద్ద వీరు వస్తున్న బైక్‌ను, మహబూబ్‌నగర్ నుంచి మద్దూరుకు వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తూ ఢీకొన్నది. ప్రమాదంలో అన్నాదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మొగులయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, లక్ష్మయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు కేశవులు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ పద్మనాభారెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. అన్నాదమ్ముల్దిరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బూర్గుపల్లిలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

కనుల పండువగా చండీ యాగం

- నాగర్‌కర్నూల్‌లో శాస్త్రోక్తంగా వేద పారాయణం
- హాజరైన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు



యాగశాల వద్ద పూజలు అందుకుంటున్న దేవతామూర్తులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 7: శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో 83వ అతిరుద్ర విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ఓంనగర్‌కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగ మండపం వద్ద ఆదివారం ఉదయం తొమ్మిది గంటల 41 నిమిషాలకు గణపతి పూజతో శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ యాగానికి అంకురార్పణ చేశారు. వేద పండితుల శాస్త్రోక్త పారాయణంతో శుద్ధి పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, ఋత్విక్‌వరుణ, గో సహిత యాగశాల ప్రవేశం చేశారు. అదేవిధంగా యాగశాల సంస్కారాలు, మండప ఆరాధనలు, వాస్తు హోమాలు, ప్రధాన మండప ఆరాధన, ప్రధాన కలశ స్థాపన, అగ్ని మథన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, పర్యగ్నీకరణ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. లోక శ్రేయస్సు కోసం బ్రాహ్మణులకు రుత్విక్ వరణ ఇచ్చి యాగ పూజ నిర్వాహణ బాధ్యతలను అప్పగించారు. సమస్త దేవతలు కొలువై ఉన్న గోస్వామీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ భక్తులను యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేయించి ప్రవేశం చేశారు. పదిహేను రోజుల పాటు యాగ కార్యక్రమం నిర్వహించేందుకు అగ్ని దేవుడిని నమస్కరించి అఖండ దీప స్థాపన చేశారు. మరోవైపు చండీ మూల మంత్రం సప్తశతి శ్లోక హవనాలను అచరించగా మహిళా భక్తులు లలితా సహస్ర పారాయణ నిర్వహించారు. అనంతరం మొదటి రోజు దాదాపు ఆరు వేల మందికి పైగా హాజరైన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు గణపతి, లక్ష్మీగణపతి, రుద్ర హోమాలతో పాటు సాయంత్రం ఆరు గంటలకు శ్రీలక్ష్మీ నృసింహ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 800 మంది రుత్వికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాగంలో స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులు హాజరై పూజలో పాల్గొన్నారు.

దీక్ష కోసం సమాధిలోకి స్వామీజీ

- బయటకు తీసుకొచ్చిన పోలీసులు
- నారాయణపేట జిల్లాలో ఘటన
- భక్తి సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకేనన్న స్వామీజీ



సమాధి నుంచి బయటకు వచ్చిన స్వామీజీ

మద్దూర్, జూలై 7 : 'భక్తి సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు సమాధిలోకి వెళ్తున్నాను. ఐదు రోజుల తర్వాత బయటకు వస్తాను.. అప్పటివరకు మీరు భజనలు చేయండి' అని భక్తులకు సూచించి ఓ స్వామీజీ సమాధిలోకి వెళ్లారు. విషయం పోలీసులకు తెలియడంతో వారు అతడిని బయటకు తీసుకొచ్చారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల శివారులో జరిగింది. మండలంలోని రెనివట్ల గ్రామానికి చెందిన చాకలి హన్మంతు వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుడు. గత ఏడాది తన పొలంలో ఎద్దు పొడిచి ఆయన భార్య మృతి చెందడంతో, అక్కడే సమాధి నిర్మించాడు. తాను కూడా వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాన్ని ఏర్పాటు చేసుకొని, సద్గురు సత్యానంద హనుమంతు స్వామిగా పేరు మార్చుకొని అక్కడే పూజలు, యోగా, ధ్యానం చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆయనకు జిల్లాతో పాటు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారు శిష్యులుగా మారారు. ఈ నేపథ్యంలో మఠంలోని అంతర్భాగంలో సమాధిని నిర్మించుకున్నాడు. తన భక్తి సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు వెళ్తున్నానని చెప్పి, ఈనెల ఐదున శుక్రవారం సమాధిలోకి వెళ్లారు. తాను ఐదు రోజుల తర్వాత బయటకు వస్తానని, అప్పటివరకు భజనలు చేస్తూ ఉండాలని భక్తులకు చెప్పి లోనికి వెళ్లిపోయాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా ఆదివారం బయటకు వచ్చింది. సమాచారం అందుకున్న నారాయణపేట డీఎస్పీ లింగయ్య, మద్దూర్ ఎస్ఐ రాంలాల్, పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. మఠం లోనికి వెళ్లి వాస్తవ పరిస్థితిని తెలుసుకున్నారు. అతడి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమాధి నుంచి బయటకు తీసుకొచ్చి ఆయనతో మాట్లాడారు. తాను జీవసమాధి అయ్యేందుకు వెళ్లలేదని, శుక్రవారం అమావాస్య రోజు ఐదు రోజుల పాటు దీక్షకు ఉపక్రమించానని తెలిపారు. విషయం బయటకు చెప్పి దీక్ష భంగం కల్గించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మఠం వద్ద పోలీసు పర్యవేక్షణ

స్వామీజీ హన్మంతు ఆరోగ్యంగా ఉన్నారని డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మఠం వద్ద పోలీసు పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సద్గురు సత్యానందతో పాటు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి నచ్చచెప్పామని, సజీవ సమాధి సరైనది కాదని సూచించామని ఆయన వివరించారు.

నేటి నుంచి మొహర్రం

- పది రోజుల పాటు వేడుకలు
- కోయిలకొండ, ఊట్కూర్‌లలో ప్రత్యేకంగా ఉత్సవాలు



ఊట్కూర్‌లో ప్రతిష్ఠించిన పీర్లు(ఫైల్)

ఊట్కూర్, జూలై 7: హిందూ ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగను సోమవారం నుంచి జరుపుకోనున్నారు. పది రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తారు. ఆదివారం నెలవంక కనిపించడంతో సోమవారం పీర్ల చావడిల ముందు అలై గుంత తీసి, పీర్ల మస్జిద్‌లలో పీర్లను ప్రతిష్ఠించారు. అలైగుంత చుట్టూ డప్పు దరువులతో పురుషులు అలైబలై ఆడనుండగా, మహిళలు బొడ్డెమ్మలు కొడుతారు. విషాదానికి గుర్తుగా ముస్లిం మహిళలు మాథంను పాడుతారు.

గ్రామ గ్రామాన..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పీర్ల పండుగకు చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడ ప్రజలు గ్రామ గ్రామన ఉత్సవాలను ఉత్సహంగా జరుపుకుంటారు. నారాయణపేట జిల్లా కోయిల్‌కొండ బీబీ ఫాతిమా సవారి తర్వాత ఊట్కూర్ మండల కేంద్రంలోని హసన్, ఉస్సేన్ సవారీలు వైభవంగా జరుగుతాయి. బతుకు దెరువు కోసం వలస వెళ్లిన పల్లె ప్రజలు మొహర్రం పండుగకు సొంత ఊర్లకు వస్తారు. వారితో పాటు ముంబాయి, పూణె, షోలాపూర్, భీమండి, రాయిచూర్, గుల్బర్గా, యాద్గిర్, తాండూర్, వరంగల్, కొడంగల్, హైదరాబాద్‌తో తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. అన్నదమ్ములు హసన్, ఉస్సేన్‌లకు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు హసన్ ఉస్సేన్‌ల పేర గొర్రెలు, మేక పోతులను నైవేద్యంగా సమర్పిస్తారు. కోర్కెలు తీరిన వాళ్లు పీర్లకు వెండి, బంగారం గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించుకుంటారు. ఊట్కూర్‌లో ఉత్సవాల్లో భాగంగా అగ్ని గుండంలోంచి నడిచి వస్తారు. పీర్లు పట్టే వ్యక్తుల వంశంలో మగ శిశువు ప్రతీ సంవత్సరం పుడతాడు. ఆ శిశువును పీర్ల తొట్లలో వేసి, ఉయ్యాల ఊపడం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఊట్కూర్ మండలంలో మొహర్రం మాసం ప్రారంభం అయ్యాక.. ఆరు నుంచి ఏడు రోజుల తర్వాత పూలిమామిడి, చిన్నపొర్ల గ్రామాలలో ఖాసీం పీర్ల ఉత్సవాలు, తొమ్మిదో రోజు నిడుగుర్తిలో వేడుకలు ప్రారంభం అవుతాయి. ఊట్కూర్‌లో, పదో రోజు కోయిల్‌కొండలో జరిగే ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయి. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం సంవత్సరంలో మొదటి మాసం మొహర్రం. ఈ మాసంలో ధర్మ రక్షణ కోసం ఎందరో మృతి చెందారని దీనిని విషాద మాసంగా ప్రకటించారు. దీంతో ఈ మాసంలో ఎలాంటి నూతన సంవత్సర వేడుకలు కానీ, శుభకార్యాలు గానీ జరుపరు. మొహర్రం మాసంలోని తొమ్మిది, 10 తేదీల్లో ముస్లింలు ఉపవాసం పాటిస్తారు.

'స్పౌజ్' దుర్వినియోగం చేసిన
జీహెచ్‌ఎం, టీచర్లపై వేటు!

» పదిహేను మంది జీహెచ్‌ఎంలపై ఆర్‌జేడీకి ఫైల్
» ఇప్పటికే నలుగురు ఎస్‌జీటీలకు షోకాజ్
» స్పౌజ్ పాయింట్లలో తప్పు చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీల పూర్తి వివరాలపై దృష్టి



స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన టీచర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీఎస్‌పీఆర్‌టీయూ నాయకులు (ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 7 : ఉపాధ్యాయ బదిలీలల్లో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన పలువురు జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు అన్నీ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్లేసు పొందిన జీహెచ్‌ఎంలకు ఇప్పటికే రెండుసార్లు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారినుంచి వివరణ కూడా తీసుకున్న జిల్లా శాఖ అధికారులు, ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రెండు రోజుల క్రితం ఆర్‌జేడీకి అందజేసినట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు. దీనిపై చర్యలు తీసుకునేందుకు ఆర్జేడీ కూడా అంతా సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పదిహేను మందిపై ఫిర్యాదులు వచ్చినా అందులో సగం మంది విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి స్పౌజ్ పాయింట్లు తీసుకొని తప్పు చేస్తున్నామని తెలిసి కూడా తమను ఎవరూ ఏమీ చేయరని జీహెచ్‌ఎంల బదిలీల సమయంలో తప్పుగా ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చి తమకు నచ్చిన ప్లేసులు తీసుకున్నారు. ఈ విషయాన్ని అప్పట్లో విద్యాశాఖ అధికారులు కూడా కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వస్తుండడంతో చర్చనీయాంశంగా మారింది. దీన్ని ఆర్జేడీ, అధికారులు సీరియస్‌గా తీసుకొని షోకాజ్ నోటీసులు ఇచ్చారు. తప్పు చేసిన జీహెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆర్జేడీకి ఫిర్యాదు కూడా చేశారు. చివరకు జీహెచ్‌ఎంలపై చర్యలు తీసుకునేందుకు అంతా సిద్ధమైంది. రెండు మూడు రోజుల్లో చర్యలు ఖాయమని తెలుస్తుంది.

ఉపాధ్యాయ బదిలీల్లోనూ దుర్వినియోగం

ఉపాధ్యాయ బదిలీలల్లో కూడా పలువురు ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన జడ్చర్ల మండల పరిధిలోని నలుగురు ఉపాధ్యాయులకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వారి నుంచి వివరణ కూడా తీసుకున్నారు. ఇందులో అంతా ఉపాధ్యాయ సంఘాల నాయకులు భార్యలు ఉండటం తీవ్ర విమర్శలకు దారిస్తున్నది. మరోమారు వారు ఆన్‌లైన్ బదిలీలకు సంబంధించి ఆప్షన్ ఇచ్చే సమయంలో ప్లేసులు ఎలా ఇచ్చారు అన్న విషయమై ఆ మండల విద్యాశాఖ అధికారి చేత పూర్తి సమాచారం ఇవ్వాలని కోరినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలి అన్న దానిపై దృష్టి పెట్టారు. ఇందులో తప్పుడు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయుల్లో పీఆర్టీయూటీఎస్, తపస్ మండల, జిల్లా నాయకుల భార్యలే ఉన్నట్లు తెలుస్తున్నది. పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యాంబాబు, రమాకాంత్ ప్రసాద్ తదితరులు స్పౌజ్ పాయింట్లను తప్పుదోవ పట్టించిన ఉపాధ్యాయులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు కూడా చేశారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు పలువురు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ కూడా స్పందించినట్లు వారు తెలిపారు. అదే కాకుండా పలు ఉపాధ్యాయ సంఘాలు కూడా డీఈవోకు ఫిర్యాదులు చేశారు స్పౌజ్ దుర్వినియోగం చేసిన టీచర్లపై చర్యలు తీసుకోకుంటే ఉపాధ్యాయ సంఘాలు ఏకమై జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు కూడా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లకు సంబంధించి స్పౌజ్ పాయింట్లు ఎవరు పెట్టారు, ఎలా వాడుకున్నారు, వారు అర్హులా, కాదా అన్న దానిపై దృష్టిపెట్టారు. రెండు మూడు రోజుల్లో పూర్తి వివరాలు రానున్నాయని, తప్పుడు చేసిన వారి శాఖాపరమైన చర్యలు ఉంటాయని డీఈవో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే జీహెచ్‌ఎంలకు సంబంధించిన ఫైల్ ఆర్జేడీకి పంపినట్లు తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 7 : ఈ నెల 21న తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బస్సు ఈ నెల 19న రాత్రి ఏడు గంటలకు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. ఈ నెల 20న రాత్రి ఎనిమిది గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. జూలై 21న మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి బయలుదేరి మహబూబ్‌నగర్ చేరుకుంటుందని ఆమె తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చారకొండ, జూలై 7 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి ఎటువంటి అనుమతులు, పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాకిటి రామకృష్ణ నల్గొండ జిల్లా డిండి వాగునుంచి జూపల్లికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రాజశేఖర్ హెచ్చరించారు.

ఘనంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 7 : మహబూబ్‌నగర్ కాటన్‌మిల్ ప్రాంతంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవాలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ వేంకటేశ్వర స్వామి 32వ బ్రహ్మోత్సవాలు శ్రీ కంచికామకోటిపీఠం పాలమూరు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సింహ వాహనంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కల్యాణోత్సవానికి వేదపండితులు కంచి నుంచి విశ్వనాథ శర్మ, శ్రీకాంత్ శర్మ, రాఘవేంద్ర శర్మ, గుండా వెంకటేశ్, సి. రాజేశ్వర్, వాసవి గ్రూప్స్ సభ్యులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు గత నెల 30 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 8న సోమవారం చండీహోమం, సుదర్శన హోమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, అవభృతం, ఆశీర్వాదం, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శ్రీకాంత్‌శర్మ తెలిపారు.

విద్యుదాఘాతంతో సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు గాయాలు

» చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్ నసీరుద్దీన్

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 7 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పుల్జాల సబ్ స్టేషన్‌లో ఆదివారం సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్జాల సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ నసీరుద్దీన్ సబ్ స్టేషన్‌లో నెలకొన్న మరమ్మతులను చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిపి పనిచేస్తున్న చాలా కాలంగా ఏబీ స్విచ్‌లను మెయింటెనెన్స్ చేయకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. విద్యుదాఘాతానికి గురైన నసీర్ కుడి చేయి పూర్తిగా కాలింది. సబ్ స్టేషన్ పక్కన ఉన్న కొందరు రైతులు గుర్తించి నసీర్‌ను నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి వద్ద విద్యుత్ శాఖ ఏఈ గోపాల్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న నసీర్‌ను పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బల్మూరు, జూలై 7 : వేపచెట్టుకు ఉరివేసుకుని దొడ్ల యాదగిరి(37) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం వెలుచర్ల గ్రామానికి చెందిన దొడ్ల యాదగిరికి భార్య మౌనికతో కొంతకాలంగా తగాదాలు ఉన్నాయి. ఆ విషయంలోనే ఆయన మానసికంగా కుంగిపోయి అచ్చంపేట మండల పరిధిలోని పోలిశెట్టిపల్లి గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా సోదరుడు శ్రీనివాసులు గుర్తించినట్లు తెలిపారు. మృతుడి అన్న శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌పాష తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అయిజ, జూలై 7 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సంకాపూర్ గ్రామ స్టేజీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు(32) ఆదివారం రాత్రి అయిజ నుంచి తుమ్మలపల్లి గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గట్టు మండలం మాచర్ల గ్రామం నుంచి శాంతినగర్‌కు చెందిన ఆటో బయలుదేరింది. అయిజ మండలం సంకాపూర్ గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే ఆటో, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆంజనేయులు తలకు తీవ్ర గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నట్లు ఆయన చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానవపాడు, జూలై 7 : పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం గోకులపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ రవికుమార్(31) ఆరు నెలల నుంచి తాగుడుకు బానిసయ్యాడు.

ఈనెల రెండో తేదీన రాత్రి ఎనిమిది గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన రవికుమార్ మళ్లీ మద్యం తాగేందు కోసం డబ్బులు కావాలని తండ్రి రామకృష్ణను అడిగాడు. ఆయన డబ్బులు ఇవ్వకపోవడంతో బయటికి వెళ్లి పురుగుల మందు తాగి ఇంట్లోకి వచ్చి పడుకున్నాడు. కొద్దిసేపటికి నోటి నుంచి నురుగలు రావడంతో తల్లిదండ్రులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనీ సర్క్యులేషన్ కంపెనీపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 7 : మెటా ఫోర్సు మార్కెటింగ్ బిజినెస్ అనే సంస్థ పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా మనీ సర్క్యులేషన్ నిర్వహిస్తున్న అనంతపూర్‌కు చెందిన మురళి అనే వ్యక్తితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు.

వివరాల ప్రకారం.. ఈ కంపెనీలో ఒక వ్యక్తి క్రిప్టో కరెన్సీ ఐదు డాలర్లు డబ్బులు చెల్లించి సభ్యత్వం తీసుకుని అదే వ్యక్తి మరో ఆరుగురిని అందు లో చేర్పించి డబ్బులు అధికంగా సంపాదించవచ్చని మాయమాటలు చెప్పి ప్రజల ద్వారా డబ్బులు అక్రమంగా సంపాదిస్తున్న సంస్థలో పని చేస్తున్న మురళిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంస్థ పేరు మీద ఎలాం టి అనుమతులు లేని సంస్థ జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో కొంతమందిని పోగు చేసి వారి వద్ద డబ్బులు సమకూర్చుకునేందుకు సమావేశం ఏర్పాటు చేయగా, ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ వారిని విచారించి ఎలాంటి అనుమతులు లేకుండా ఉండడంతో మురళితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేఎల్ఐ కాల్వల వైపే అన్నదాత చూపు



ఊర్కొండ మండలం మాదారం గ్రామం వద్ద నీళ్లు లేక వట్టిపోయిన కేఎల్ఐ ప్రధాన కాల్వ

- నదీ తీరం వెంట వర్షాలు అంతంతే
- కృష్ణానదిలో పారని జలాలు
- శ్రీశైలం ప్రాజెక్టులో 37టీఎంసీలకు పడిపోయిన కృష్ణా జలాలు
- వట్టిపోయిన కేఎల్ఐ కాల్వలతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పరిస్థితి ఇలాగే ఉంటే ఖరీఫ్‌కు కష్టకాలమే

తాడూరు, జూలై 7 : ప్రస్తుతం అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో అన్నదాతల చూపంతా కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించిన ప్రధాన కాల్వల వైపే ఉంది. కృష్ణానది తీరం వెంట అనుకున్న స్థాయిలో వానలు కురవకపోవడం మూలంగా నదీతీరం వెంట ఉన్న ప్రాజెక్టులన్నింటిలో నీటి మట్టం గణనీయంగా తగ్గి డెడ్‌స్టోరేజీ దిశగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించి శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మూడు లిఫ్టుల ద్వారా అన్నదాతలకు వ్యవసాయానికి సాగునీరందించేవారు. అయితే కృష్ణానదిలో నీటి లభ్యత లేకపోవడం మూలంగా కేఎల్ఐ కాల్వలన్నీ నీళ్లు లేక వెలవెలబోతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం ఇప్పటికే కృష్ణానదిలో సమృద్ధిగా నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రస్తుతం ఈ ఏడాది ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవకపోవడంతో నీటి కొరత ఏర్పడింది. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తిస్థాయి నీటి మట్టం 885అడుగులకుగాను 215.807టీఎంసీలు కాగా ప్రస్తుతం 814అడుగుల లోతులో 37.2470టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో లిఫ్టులకు నీరందే పరిస్థితి లేదు.

కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ వివరాలు..

కేఎల్ఐ లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించి కృష్ణానది బ్యాక్‌వాటర్ నుంచి ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి మూడు లిఫ్టుల ద్వారా 40టీఎంసీల నీటిని నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరందించే సదుద్దేశంతో 1984లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించగా అక్టోబరు 17, 2017న పనులు పూర్తి చేసుకుని లిఫ్టును ప్రారంభించారు. ఈ లిఫ్టు ద్వారా దాదాపు వంద కిలో మీటర్ల మేర ప్రధాన కాల్వతో పాటు మరో వంద కిలో మీటర్ల మేర సబ్‌కెనాల్స్ ద్వారా రైతులు సాగు చేసిన పంటలకు సాగు నీరందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నీరు లభ్యత లేకపోవడం మూలంగా కాల్వలన్నీ వట్టిపోతుండడంతో వర్షాలు ఎప్పుడు పడతాయో అన్న ఆలోచనతో ఆవేదన చెందుతున్నారు. కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు సరఫరా అయినట్లయితే వర్షాలు అనుకూలంగా లేనప్పటికీ మోటార్ల సహాయంతో పంటలను కాపాడుకునే వెసులుబాటు ఉండేదంటూ అన్నదాతలు వాపోతున్నారు. కేఎల్ఐ కాల్వల ద్వారా నీటి లభ్యత తగ్గడంతో సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గే అవకాశాలు ఉండే పరిస్థితి నెలకొంది.



తుమ్మలసూగురు గ్రామం వద్ద నిండుకుండలా ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వ (ఫైల్)

ఐదు నియోజకవర్గాల్లో కేఎల్ఐ సాగునీరు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొల్లాపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు ప్రస్తుతం మూడు లక్షలకు పైగా ఎకరాలకు కేఎల్ఐ ద్వారా సాగు నీరందడంతో పాటు 300గ్రామాలకు పైగా 500చెరువులతో పాటు దుందుభీ నదిలో సైతం కృష్ణా జలాలతో కళకళలాడుతూ ఉండేది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకానికి సంబంధించి కృష్ణా జలాలు అందుబాటులోకి రాకపోవడం మూలంగా కేఎల్ఐ ప్రధాన కాల్వలతో పాటు సబ్‌కెనాల్స్ పరిధిలో ఉన్న అన్నదాతలు దుందుభీ నది పరివాహక ప్రాంతం వెంట ఉన్న రైతులు అయోమయంలో ఉన్నారు. కృష్ణానదిలో నీటి లభ్యత మొదలైందంటే ఉమ్మడి జిల్లాలో సగభాగమంతా కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీరందనుంది. మొత్తంగా కృష్ణానది ప్రవాహం పైనే కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించిన ఎత్తిపోతల పథకం భవిష్యత్తు ఆధారపడి ఉండడంతో అన్నదాతల చూపంతా కృష్ణానది వైపే ఉంటుందన్న విషయంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కృష్ణానది ప్రవాహం జూన్ నుంచి ప్రారంభమైన జూలై, ఆగస్టు, సెప్టెంబర్లలో కొనసాగనుండగా ప్రస్తుతం నెలరోజులు పూర్తైనా ఇంకా కృష్ణా జలాశయాలు డెడ్‌స్టోరేజీలో ఉండటంతో పరివాహక ప్రాంత రైతులందరూ ఆందోళన చెందుతున్నారు.

నీరు వస్తేనే సమృద్ధిగా పంటలు



ప్రస్తుతం వాతావరణంలో జరుగుతున్న మార్పులకనుగుణంగా వర్షాలు పంటలకు అనుకూలంగా సకాలంలో కురవడం లేదు. ప్రత్యామ్నాయమైన కేఎల్ఐ కాల్వల్లో కృష్ణా జలాలకు సంబంధించిన సాగునీరు వస్తేనే వర్షాల కురవని సమయంలో పంటలకు ఆ సాగునీరందించి కాపాడుకోగలుగుతాం. లేకుంటే ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమే.

- శ్రీశైలం, రైతు, సిర్సవాడ

దేశాన్ని పాలిస్తున్న కార్పొరేట్ శక్తులు

- ప్రముఖ కవి కె.శివారెడ్డి



'యుద్ధంలో పావురం' పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

పాలమూరు, జూలై 7 : భారతదేశాన్ని నేడు పాలకులు కాదు, కార్పొరేట్ శక్తులు అదాని లాంటివాళ్ల పాలిస్తున్నారని ప్రముఖ కవి కె.శివారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అల్మాస్ ఫంక్షన్ హాలులో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో "యుద్ధంలో పావురం" ఖలీల్ కవిత్వం పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమానికి కే.సీ వెంకటేశ్వర్లు, ఎ.తిమ్మప్ప, యం.వెంకట్రాములు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథిగా హాజరైన కవి కె.శివారెడ్డి మాట్లాడారు. ఖలీల్ కవిత్వం అందరికీ అర్థమయ్యే భాషలో ఉందన్నారు. అన్నం మెతుకు కిందపడితే కళ్లకద్దుకునే మా అమ్మమ్మను చూసి నేర్చుకున్న ఆ మెతుకును సృష్టించిన కర్తవిముక్తి కోసం ప్రాణమైన పణంగ పెట్టాలని రాయటం సహజంగా ఉందన్నారు. కవిత్వం రాయటంతో సజీవంగా ఉన్నట్లు అనిపిస్తుందన్నారు. కవిత్వం రాయటమంటే పేపర్‌మీద బలికావటమే నని శ్రీశ్రీ చెప్పిన మాటలను గుర్తు చేశారు. మట్టిని ప్రేమించేవాళ్లే మనుషులను ప్రేమిస్తారని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాకు వస్తే రామ్మోహన్, జలజం సత్యనారాయణను జ్ఞాపకం చేసుకోకుండా ఉండలేమన్నారు. కవిత్వం రాయటానికి కవి స్వార్థమనే గీతను దాటి పనిచేయాల న్నారు. మనుషులతో సంభాషించటమే కళ అన్నారు. దేశమంటే మట్టికాదు.. మనుషులు, అన్ని మతాల సారం ఒక్కటేనని చెప్పిన పెద్దల మాటలు మననం చేసుకోవాలని కవి యాకూబ్ చెప్పారు. హృదయబంధం ఒక్కటే ఖలీల్ జీవితమంత... అక్షరాల కన్నీటికి ముందు ఖలీల్ ఉన్నాడని తెలిపారు. పనికొచ్చేది, సమాజానికి అవసరమైనది కవిత్వం... అదే ఖలీల్ కవిత్వంలో బయటికి చెప్పారన్నారు. ప్రగతిశీల ఉద్యమంలోంచి వచ్చిన ఖలీల్ జీవితమంతా కవిత్వంలో ఉందని యం.రాఘవాచారి అన్నారు. సమసమాజ స్వప్నాలలో ఎదుగుతూ యువజన, కార్మికోద్యమాలలో కార్యకర్త, నాయకుడైనాడన్నారు. కాపాడు కోగలిగిన, అందివచ్చిన ఖలీల్ కవిత్వాన్ని పాలమూరు అధ్యయన వేదిక యుద్ధంలో పావురం పేరుతో కవితా సంపుటిగా తీసుకువచ్చిందన్నారు. వీ౩ చానల్ ఎం.డి. కాచం సత్యనారాయణ, చైతన్య మహిళా సంఘం నాయకురాలు కె.శ్రీదేవి, జి.రాజేందర్‌రెడ్డి, సీపీఐ కార్యదర్శి బి.బాలకిషన్, ఎండీ హనీఫ్, జనజ్వాల, పి.అరుణ్, ఆర్.నాగభూషణం, జక్కా గోపాల్, బోల యాదయ్య, తదితర ప్రముఖులు ప్రసంగించారు.

రహదారులతోనే గ్రామాలు అభివృద్ధి: ఎంపీ



నాలుగు లైన్ల రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

వంగూరు, జూలై 7: రహదారులు పూర్తి స్థాయిలో నిర్మిస్తేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలో కొండారెడ్డిపల్లి గేటు నుంచి గ్రామం చివర వరకు రూ. 21 కోట్లతో మంజూరైన నాలుగు లైన్ల రహదారి పనులను, గ్రామంలో రూ. 2.50 కోట్లతో మంజూరైన మిని పాలశీతలీకరణ కేంద్రంను ఆదివారం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారులు దేశప్రగతిని ప్రతిబింబిస్తాయని, వాటిని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఈ గ్రామానికి మండల అభివృద్ధికి గాను పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వారి స్వగ్రామైన కొండారెడ్డిపల్లికి అక్టోబర్‌లో విజయదశమి పండగకు వస్తుండటంతో ఆ లోపే రహదారి పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, ఎస్ఈ నర్సింగం, ఈఈ దేశ్యానాయక్, నాగలక్ష్మి, లక్ష్మీపతి, నాయకులు కేవీఎన్‌రెడ్డి, బాలాజీసింగ్, వేమారెడ్డి, బీకే రెడ్డి, క్యామ మల్లయ్య, పి.కృష్ణారెడ్డి, లాలుయాదవ్, చందుయాదవ్, తదిరులు పాల్గొన్నారు.

చినుకు పడితే పవర్ కట్

- మండల సబ్ స్టేషన్ పరిస్థితి
- జిల్లా కేంద్రం నుంచి సరఫరా అయ్యే 132 కేవీ లైన్ నుంచి సమస్య : ఏఈ



హన్వాడ సబ్ స్టేషన్

హన్వాడ, జూలై 7 : చిన్న పాటి వర్షం కురిస్తే చాలు మండలానికి కరెంట్ కట్ అవుతుంది. ఈ వర్షాకాలం సీజన్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా చిన్నపాటి చినుకు పడితే చాలు జిల్లా కేంద్రంలోని ప్రధాన సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 132 కేవీ లైన్ సరఫరాలో అంతరాయంతో పవర్ కట్ చేస్తున్నారు. వర్షాలు, గాలులు వీచే సీజన్ రాక ముందే విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకునేవారు. ఈ సారి ఎందుకో అలాంటి పరిస్థితి కనిపించ డం లేదు. మూడు రోజుల క్రితం సాయంత్రం సమయంలో వర్షం కురవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అర్ధరాత్రి 12 గంటలకు కరెంట్ సరఫరా చేశారు. జూన్ నెలలో అనేక సమయాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా లేకపోతే వర్షాకాలంలో రాత్రివేళ క్రిమికీటకాల వల్ల ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని మునిమోక్షం, హన్వాడ, టంకర సబ్ స్టేషన్లలో ఈ పరిస్థితి నెలకొంది. వేపూర్, గొండ్యాలకు, మద్దూరు మెయిన్ లైన్ నుంచి కరెంట్ సరఫరా ఉంది. ఆ రెండు సబ్ స్టేషన్‌లకు సరఫరా సక్రమంగా జరుగుతుంది.

132 కేవీ లైన్ వల్లే

మండలంలోని సబ్ స్టేషన్లలో ఎలాంటి సమస్య లేదు. గాలులు, వర్షాలు కురిసినప్పుడు జిల్లా కేంద్రం నుంచి ప్రధాన సబ్ స్టేషన్ ద్వారా సరఫరా అయ్యే 132 కేవీ లైన్‌లో సమస్య ఏర్పడినప్పుడు ఇబ్బంది పడుతున్నాం. అయినా వెంటనే మా సిబ్బందితో కలిసి సమస్యను పరిష్కరిస్తున్నాం.

- రామకృష్ణ, విద్యుత్ ఏఈ

రాత్రి సమయాల్లో ఇబ్బంది పడుతున్నాం

చిన్నపాటి వర్షానికి కరెంట్ పోతే ఇబ్బంది పడుతున్నాం. రాత్రి సమయాల్లో పవర్ లేక దోమల బాధతో నిద్ర రావడం లేదు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ముందుగానే సమస్యలను గుర్తించి కరెంట్‌కు అంతరాయం లేకుండా చూడాలి.

- సుదర్శన్‌రెడ్డి, గ్రామస్థుడు

త్వరలో సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ టోర్నీ

- ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యాంసుందర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.శ్యామ్ సుందర్ గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 7 : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ విజయవంతంగా నిర్వహించామని, త్వరలో సౌత్‌జోన్ లేదా ర్యాంకింగ్ టోర్నీ నిర్వహిస్తామని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్. శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకరంతో మొదటి సారి అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించామన్నారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు టోర్నీ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. సమావేశంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షులు జీ.శివప్రసాద్, ఎంపీ ప్రవీణ్‌కుమార్, ఉదయ్‌రెడ్డి, నాగరాజు, ట్రెజరర్ ఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు.

అధ్యక్ష పదవి ఇవ్వాలి

- కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

గద్వాల న్యూటౌన్, జూలై 7 : జోగులాంబ గద్వాల బీఆర్ఎస్‌కు పెద్దదిక్కుగా, పార్టీ ఏర్పడిన నాటినుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన తనకు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ నాగర్‌దొడ్డి వెంకట్రాములు ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. బీఆర్ఎస్ పార్టీ గద్వాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గద్వాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ క్యాడర్ దెబ్బతినకూడదనే ఉద్దేశంతో తనను అధ్యక్షుడిగా నియమించాలని కోరేందుకు నేరుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు జిల్లాలో ఉన్న కొందరు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లారు. తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను కోరినట్లు వెంకట్రాములు తెలిపారు. స్పందించిన కేసీఆర్ ఈనెల 11న జిల్లాలో ఉన్న బీఆర్ఎస్ నాయకులతో చర్చించి జిల్లాకు బీఆర్ఎస్ అధ్యక్షుడితో పాటు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తానని సూచించినట్లు తెలిసింది. కేసీఆర్‌ను కలిసిన వారిలో నాగర్‌దొడ్డి వెంకట్రాములుతో పాటు, బీఆర్ఎస్ నాయకులు మందమల్లి, అతికూర్ రహిమాన్, రంగుమద్దిలేటి, ఆటో మక్బూల్, జనార్ధన్‌రెడ్డి, మహానంది. కుర్వ పల్లయ్య, దేవమణి, సత్యం తదితరులున్నారు.

జిల్లా క్రీడాకారులు రంజీ స్థాయికి ఎదగాలి

- ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్



ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 7 : క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రంజీ జట్టుకు ఎంపికకావాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న హెచ్‌సీఏ టూడే లీగ్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-23 బాలుర జట్టుకు ఎంపికను ఆదివారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. హెచ్‌సీఏ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ సంఘ ఆధ్వర్యంలో గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను వేసవిలో ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల శిక్షణ శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు 33 మందిని ఎంపిక చేశామని, శిక్షణ శిబిరం నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ సభ్యులు సురేష్ కుమార్, కోచ్‌లు అబ్దుల్లా, మన్నాన్, అబిద్ పాల్గొన్నారు.

చెంచులకు పదెకరాల భూమి



చెంచులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబురావు

కొల్లాపూర్, జూలై 7 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెంచు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి పదెకరాల భూమి, సొంత ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని ఆదివాసి అధికార రాష్ట్రీయ మచ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లి భ్రమరాంబ కాలనీలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి బి.శివవర్మ అధ్యక్షతన జరిగిన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆదివాసి అధికార రాష్ట్రీయ మచ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బాబురావు హాజరయ్యారు. భ్రమరాంబ కాలనీలో ఇటీవలే పాశవి క దాడికి గురైన బాధిత చెంచు మహిళను ఆయన పరామర్శించారు. చెంచులకు న్యాయం జరిగేంత వరకు ఆదివాసి అధికార రాష్ట్రీయ మచ్ ఆధ్వర్యంలో పోరాడుతూనే ఉంటుందని బాబురావు పేర్కొ న్నారు. సమా వేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్య వర్గ సభ్యులు ఆర్.శ్రీను, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్, రాష్ట్ర ఉ పాధ్యక్షుడు భీంరావు, సహాయ కార్యదర్శి బండారు రవికు మార్, గిరిజన సం ఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, దశరథం, సీఐటీయూ నా యకులు ఈశ్వర్, రైతు సంఘం జిల్లాకార్యదర్శి ఎం.శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ బాలపీరు, ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్, డీవైఎఫ్ఐ మండల కా ర్యదర్శి బాలునాయక్, జల్లాపురం సురేందర్, చెంచు సేవా సంఘం అధ్యక్షు డు వెంకటేశ్, కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి మల్లయ్య పాల్గొన్నారు.

మేడికల్లుతో మేలెంతో

- కల్లు కోసం జనం తాపత్రయం - ఉచితంగా సరఫరా చేస్తున్న గౌడన్న



మేడి చెట్టుకు కల్లు తీస్తున్న గౌడన్న

పెద్దకొత్తపల్లి, జూలై 7 : తాటి, ఈత, ఖర్జూర చెట్లకు గీత గీస్తే కల్లు పారడం చూశాం. కానీ, మేడి చెట్టుకు గీత గీసి కల్లు కాస్తున్న వింత ఘటన జిల్లా చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లి గ్రామంలో చౌకధర దుకాణం దగ్గర ఉన్న మేడి చెట్టు కొమ్మలను ఆ ఇంటి యాజమాని కొట్టేశాడు. చెట్టు నుంచి కల్లు కారుతుండడం చూసిన గ్రామస్థులు గీత కార్మికుడు ఏదుల శివగౌడ్‌కు సమాచారమిచ్చారు. మేడి చెట్టుకు కారుతున్న కల్లును చూసిన శివగౌడ్ గీత గీసి కుండను కట్టాడు. దీంతో మేడి చెట్టునుంచి ఉదయం, సాయంత్రం రోజు 20సీసాల కల్లు కారుతున్నట్లు ఆయన తెలిపారు. చెట్టు నుంచి వచ్చిన కల్లును గ్రామస్థులకు ఉచితంగా పోస్తున్నాడు. ఈ కల్లు తాగిన కొందరిని శనివారం 'ఆంధ్రజ్యోతి' విలేకరి పలుకరించగా ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. మేడి కల్లు తాగడం వల్ల దీర్ఘకాలికంగా ఉన్న రోగాలు నయమవుతున్నాయని చెప్పారు. కల్లు తాగిన వారు ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రచారం చేస్తున్నారు.

మేడి కల్లు తాగడంతో కాళ్ల నొప్పులు తగ్గాయి

మా గ్రామంలో మేడి చెట్టు కల్లు గీయడంతో ఆ కల్లును తాగాను. ఎన్నో ఏళ్లుగా కాళ్లనొప్పులు ఉన్నాయి. ఇబ్బందిగా ఉండేది. ఈ కల్లు తాగడం వల్ల ఎంతో నయమైంది. ఇది దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నా.

- ఊశమ్మ, చిన్నకొత్తపల్లి

సారా సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

పెద్దకొత్తపల్లి, జూలై 7 : అక్రమంగా సారా సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ చెన్నగౌడ్ తెలిపారు. కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి ఆదేశాల మేరకు మారేడుమానుదిన్నె గ్రామానికి చెందిన పాత్లావత్ నరసింహ అనే వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్ 100 వాహనంపై 12లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తుండగా యాపట్ల ఎక్స్ రోడ్డు దగ్గర దాడులు చేసి పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని సీజ్ చేసి సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కోడేరు, జూలై 7 : మండల పరిధిలోని సింగాయిపల్లి, రాజాపూర్ మధ్యన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు కాగా స్థానికులు ఆసుపత్రికి తరలించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన రాజయ్య, అంజమ్మ ఇద్దరు భార్యాభర్తలు మోటారు సైకిల్‌పై రేవల్లి నుంచి పాన్‌గల్ బాలపీర్ల దగ్గరకు వెళ్తూ సింగాయిపల్లి, రాజాపూర్ మధ్యలో రోడ్డు మరమ్మతులు జరుగుతున్నందున బైక్ అదుపు తప్పి కంకర బొడ్డె మీద ఎక్కి కింద పడడంతో ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు వారికి మంచినీళ్లు తాగించి వారికి సంబంధించిన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వారికి ప్రాణపాయం తప్పిందని తెలిపారు.

కేసు నమోదు

వెల్దండ, జూలై 7 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలో శనివారం ద్విచక్రవాహనదారునికి అడవిపంది తగిలి కిందపడి గాయపడిన సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. చెర్కూర్ గ్రామంలో తన మిత్రుడు మృతి చెందడంతో జావేద్ అనే వ్యక్తి అతనిని చూడటానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పంది తగిలి క్రిందపడడంతో గాయాలయ్యాయి. ఈ మేరకు అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



సక్రి (ఫైల్)

వెల్దండ, జూలై 7 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని ఉబ్బలగట్టుతండాకు చెందిన వడ్త్యావత్ సక్రి (55) అనే మహిళ ఆదివారం సాయంత్రం తన ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ... సక్రి పొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చింది. కాగా అప్పటికే ఆమె కుమారుడు స్నానానికి హీటరు వేసి ఉంచగా ఇంటిలో విద్యుత్ అర్తింగ్ వచ్చి ప్రమాదవశాత్తు వైరు తగిలి సక్రి మృతిచెందినట్లు తెలిపారు. సక్రి భర్త గతంలోనే చనిపోగా ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. సక్రి మృతితో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఉపాధి హామీ దిమ్మెలు ధ్వంసం



ముత్తిరెడ్డిపల్లిలో ఉపాధి హామీ దిమ్మెలను ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు

కోడేరు, జూలై 7 : గ్రామీణ ఉపాధి హామీ దిమ్మెలు ధ్వంసం చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ముత్తిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సనిత కథనం ప్రకారం... గ్రామంలో ఉపాధి హామీ పనులు పూర్తి అయిన చోట నూతనంగా పది దిమ్మెలను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దిమ్మెలను కూల్చివేయడంతో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

మైసమ్మ ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

కోయిలకొండ, జూలై 7 : మండల కేంద్రంలో ప్రసిద్ధమైన మైసమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆదివారం నాయకులు భూమి పూజ చేశారు. ఇదివరకు ఉన్న మైసమ్మ దేవాలయాన్ని గత ఏడాది సూరారం గ్రామం నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో పూర్తిగా ధ్వంసమైంది. దీంతో మళ్లీ నిర్మించేందుకు గ్రామ నాయకులు ముందుకు వచ్చి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు రవీందర్, విద్యాసాగర్ గౌడ్, నరేందర్ గౌడ్, నారాయణగౌడ్, శ్రీధర్, రామస్వామి, సత్యనారాయణ, రఘురామాచారి, ఆశన్నగౌడ్, సత్యం, వీరాచారి, రాజుచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 7 : శ్రీ హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మోడల్‌బేసిక్ స్కూల్‌లో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీపీఐ పట్టణ ఉప కార్యదర్శి కోటకదిర నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. క్రీడలతో ఆరోగ్యం, చదువులో చురుకుగా రాణిస్తారని తెలిపారు. మాస్టర్ వెంకటేష్ మాట్లాడుతూ 30 మంది విద్యార్థులకు బెల్టులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్, మహేందర్, బాలకృష్ణ, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 7 : ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద ఉపకార వేతనం పొందేందుకు అర్హులైన మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రవీంద్రనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2024 నుంచి జూలై 31,2024 వరకు విదేశీ విద్యాలయాల్లో అడ్మిషన్ పొందిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 7వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.తెలంగాణఈపాస్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు తరువాత హార్డ్ కాపీలను ఆగస్టు 28లోగా కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కుల అసమానతలపై పోరాడాలి



మూసాపేటలో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు కె.గోపాల్

అడ్డాకుల, జూలై 7 : సమాజంలోని దోపిడీకి, కుల అసమానతలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నాయకులు ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట నాయకుడు కె.గోపాల్ అన్నారు. ఆదివారం మూసాపేటలో కేవీపీఎస్ మండల కార్యదర్శి వెంకటరమణ అధ్యక్షతన ముఖ్య నాయకులకు నిర్వహించిన ఒక్క రోజు రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ అటంరానితనం ఉందని, ధనికులు పేదలను దోచుకుంటున్నారని, బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో యువకులు అసమానతలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం 15 మందితో కేవీపీఎస్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కురుమూర్తి, వెంకటరాములు, గౌరవ అధ్యక్షుడిగా కొండన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎం.మాణిక్యంరాజు, కురుమయ్య, లక్ష్మీదేవి, నాగన్న, హన్మంతు, జంగాల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి ఘన సన్మానం



ఎంపీటీసీ మాజీ సభ్యుడిని సన్మానిస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు

హన్వాడ, జూలై 7 : మండలంలోని కొనగట్టుపల్లి తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెద్ద చెన్నయ్యను ఆదివారం నాయినోనిపల్లి గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామస్థుల సహకారంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు రామకృష్ణ, బాలవర్ధన్, కృష్ణయ్య, నర్సింములు, సత్యయ్య గంగాపురి, తిరుపతయ్య కేశవ, అంజి, నర్సింములు, రవికుమార్, రాములు, చిన్న, చెన్నయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి : బీజేపీ



మొక్క నాటుతున్న బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతీ కిరణ్, నాయకులు

గండీడ్, జూలై 7 : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ పరిగి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతీ కిరణ్ కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జక్లపల్లి, కప్లాపూర్ గ్రామాల పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవ్వరూ అధైర్యపడవద్దని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మోహన్‌గౌడ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు నర్సయ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రఘు, కేశవులు, పాండు, బాలయ్య, చెన్నయ్య వెన్నాచేడ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి గొడుగు రాములు, జక్లపల్లి బూత్ అధ్యక్షుడు తిరుపతయ్య కృష్ణయ్య, భీమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

జడ్చర్ల, జూన్ 7 : కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జడ్చర్ల పట్టణంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ లక్ష్మయ్య కథనం మేకు.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామానికి చెందిన బాలీశ్వరి (37) తన భర్త పి.గంగయ్యలు టిప్పర్లు సక్రమంగా నడుస్తలేవని, ఈ కిస్తులు ఏవిధంగా కడతావని, పిల్లలు ఎదిగొస్తున్నారని నిత్యం గొడవ పడేవారు. శనివారం కూడా అలాగే గొడవ పడిందని, ఇంట్లో రాత్రి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న విషయాన్ని తమ్ముడు బాలరాజుకు తెలుపడంతో ఆయనతో పాటు బంధువులు అక్కడి వచ్చి చూసేసరికి మృతి చెందిందన్నారు. తమ్ముడు బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

డీఎస్సీ వాయిదా వేయాలి

- మహబూబ్‌నగర్ సెంట్రల్ లైబ్రరీ డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం నాయకుల డిమాండ్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహకు వినతి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహకు వినతి పత్రం అందజేస్తున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 7 : వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నందున డీఎస్సీ పరీక్షకు సన్నద్ధం కాలేకపోయామని, తమకు న్యాయం చేసేందుకు డీఎస్సీ పరీక్షను కొద్ది రోజులు వాయిదా వేయాలని మహబూబ్‌నగర్ సెంట్రల్ లైబ్రరీ డీఎస్సీ నిరుద్యోగుల అభ్యర్థుల సంఘం నాయకులు కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహను జిల్లా కేంద్రంలో కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు డీఎస్సీకి సిద్ధమయ్యేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు అభ్యర్థులు కోరారు. మంత్రిని కలిసిన వారిలో సాయిరాం, అనూష, తదితరులు ఉన్నారు. అంతకు ముందు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశారు.

కోయిలకొండ ఆసుపత్రి సమస్యలపై మంత్రికి వినతి

కోయిలకొండ : మండల కేంద్రమైన కోయిలకొండ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు వినతిపత్రం అందించారు. ఆదివారం జిల్లాలో మంత్రిని కలిసి ఆసుపత్రి సమస్యల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఆసుపత్రి భవనం ఉన్నా అందులో సిబ్బందితో పాటు వసతులు లేవని తెలిపారు. ఆసుపత్రికి అవసరం ఉన్న సిబ్బందితో పాటు, వైద్య పరికరాలు, వసతుల కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వినతికి మంత్రి స్పందించి వసతులు, సిబ్బంది కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి

- పుర వార్డులలో పర్యటించిన మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్



అప్పన్నపల్లి పోచమ్మ అమ్మవారి మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూలై 7 : పాలమూరు పురపాలిక పరిధిలో ఆదివారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని 10వ వార్డులోని విఘ్నేశ్వరకాలనీ, 3వ వార్డులోని అప్పన్నపల్లి, 5వ వార్డులోని ఏనుగొండ, 28వ వార్డులోని బండ్లగేరిలో పర్యటించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అప్పన్నపల్లిలో పోచమ్మగుడి మండపానికి శంకుస్థాపన చేశారు. విఘ్నేశ్వరకాలనీలో ఇళ్ల మధ్య నిలుస్తున్న మురుగునీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరారు. ఏనుగొండలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, వెంటనే పనులు చేయించాలని ప్రజలు కోరారు. వీటిపై చైర్మన్ స్పందిస్తూ పురపాలిక అభివృద్ధి కోసం ఇటీవలే నిధులు వచ్చాయని ఆ నిధులతో అన్ని వార్డులలో అత్యవసరమైన పనులను గుర్తించి చేపడతామన్నారు. డ్రైనేజీ వ్యవస్థకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చేపడుతున్నామని, అదేవిధంగా సీసీరోడ్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు చేపడతామని, రానున్న బోనాల పండగను దృష్టిలో ఉంచుకుని పోచమ్మ ఆలయాల వద్ద పారిశుధ్య పనులు చేయిస్తామని పేర్కొన్నారు.

పదేళ్ల కాలంలో ప్రతిపక్షాల ఫ్లెక్సీలు వేయనిచ్చావా ?

- మా దృష్టి అభివృద్ధిపై తప్ప ? ఫ్లెక్సీలపై లేదు

- మాజీ మంత్రిపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్, జూలై 7 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షాలను ఫ్లెక్సీలు వేసుకోనివ్వని చరిత్ర నీదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై మండిపడ్డారు. ఫ్లెక్సీలు వేసుకున్న పది నిమిషాల్లోనే మునిసిపల్ సిబ్బంది వెళ్లి వాటిని తొలగించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమకు ఆ అలవాటు లేదని, తమ దృష్టంతా అభివృద్ధిపైనే తప్ప ఫ్లెక్సీలపై లేదన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీల విషయంలో రాజకీయం చేయాల్సిన పని తమకు లేదని, మేము అలాంటి పనులు చేయమన్నారు. ఇకపై మా ఎమ్మెల్యేపై, పార్టీపై అనసవర మైన విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఫ్లెక్సీలలో తొలగిస్తారేమోకానీ, ప్రజల మనసుల్లోంచి తొలగించలేరని ఆయన మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందన్నారు. ప్రజల మనసుల్లో లేకనే మమ్మల్ని 20 వేల ఓట్లతో గెలిపించారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలోనే మిమ్మల్ని మరిచిపోయారన్నారు. బీజేపీతో బేరం కుదుర్చుకుని బీఆర్ఎస్ ఓట్లన్నీ మళ్లించారని, నియోజకవర్గంలో కేవలం 13 వేల ఓట్లు మాత్రమే వచ్చిన సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. మీ హయాంలో పాలమూరులో జరిగిన అరాచకాలు, అక్రమాలు అన్నీఇన్నీ కావని, అవన్నీ ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో జరిగిన అవినీతి అక్రమాలు బయటకు వస్తున్నాయని, ఇకనైనా ఇలాంటి రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మీడియాసెల్ ఇన్‌చార్జి సీజే బెనహర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్



ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ చేస్తున్న శ్రేణులు

పాలమూరు, జూలై 7 : మాదిగల చిరకాల కోరిక వర్గీకరణ అంశానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మునిసిపల్ చైర్మన్ ఏ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావమై 30ఏళ్లు అయిన సందర్భంగా అనాథ శరణాలయంలో పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బాలలు, కాలనీవాసులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీయం ఏ.రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఎన్నికల సందర్భంగ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వర్గీకరణ చేస్తామని విస్మరించటం సరికాదన్నారు. కార్యక్రమంలో రామస్వామి, యాదయ్య, వెంకటయ్య. శివరాములు, భాస్కర్, రాజు, కొత్త మాధవ్, కిరణ్, కొత్త ప్రవీణ్ కుమార్, బి.వెంకటయ్య, నరేష్, రావుల కృష్ణ, జయన్న, జయమ్మ, బాలయ్య, ఎల్లప్ప, జుట్ల రవికుమార్, జాన్సన్, ప్రశాంత్, శ్రీను, కాలె మణ్యం పాల్గొన్నారు.

● మిడ్జిల్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా నాయకులు కేక్ కట్‌చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేష్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు టైగర్ జంగయ్య, శ్రీనివాస్‌బహదూర్, బరిగెల బాలయ్యతో కలిసి సురేష్‌మాదిగ ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దేవయ్య, బాలు, రవీంద్ర, భీంరాజ్, రాజేష్, సురేష్, ప్రశాంత్, రాజు, అంజి, శివ, రాజు, బంగారు ఉన్నారు.

● అడ్డాకుల : అడ్డాకులలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎంఆర్‌పీఎస్ జెండాను ఎగురువేశారు. పాతిరి ప్రసాద్, మునగాల హన్మంతులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ మాదిగల కోసం ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో మునగాల శ్రీకాంత్, మునగాల దానేలు, దేవదానం, మునగాల చంద్రం, రామన్న, శేఖర్, సులేమాన్, బాలరాజు, బాలచందర్, ప్రశాంత్, కొండన్న, బాలన్న, యేసు పాల్గొన్నారు.

కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి

పాలమూరు, జూలై 7 : జూలై 10వ తేదీన కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికుల కోర్కెల దినం, "డిమాండ్స్ డే"ను జయప్రదం చేయాలన్నారు. కార్మికవర్గానికి సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని డిమాండ్స్ డేను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ రద్దు చేయాలన్నారు. బొగ్గుబ్లాక్‌లను వేలం వేయటం ఆపాలన్నారు. కార్మికులందరికి సమానవేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 73షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు వరద గాలెన్న, దామాయపల్లి వెంకటయ్య యాదయ్య, రాములు, గోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లిన నాయకులు



బక్కని నర్సింహులుతో నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 7 : విభజన సమస్యలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించేందుకు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి మహబూబ్‌నగర్ నియోజకవర్గం ముఖ్య నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బి.చంద్రశేఖర్‌రెడ్డి, పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.బాలప్ప, రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. కాసీం, బీసీ నాయకుడు తిరుపతయ్య టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అజయ్, గౌస్‌బాయ్ మైనార్టీ నాయకులు ఇబ్రహీం, కౌనాల్, మురళి పాల్గొన్నారు.

తెలంగాణలో మళ్లీ అధికారంలోకి..

హన్వాడ : హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి మండల పార్టీ అధ్యక్షుడు ఎం.డి. ఖాసీం ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. చంద్రబాబు ఆధ్వర్యంలో తెలంగాణలో పార్టీ మళ్లీ అధికారంలో వస్తుంని ఖాసీం ధీమా వ్యక్తం చేశారు.

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 7 : రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బండ్లగేరిలో మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గుణం ప్రతీ ఒక్కరు అలవరచుకోవాలని, అదేవిధంగా ప్రమాదంలో గాయపడిన వారికి కూడా రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రక్తదానం చేయడం గొప్ప విషయమని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు వెంకటేష్, శివరాజు, సత్యం, ప్రవీన్‌కుమార్, శ్రీనివాసులు, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

17. 8 అడుగుల వద్ద కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర, జూలై 7 : జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు అయిన కోయిల్‌సాగర్ నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 17.8 అడుగులకు చేరిందని ఈఈ ప్రతాప్ సింగ్ తెలిపారు. జూరాల నుంచి వస్తున్న కృష్ణాజలాలను తీలేర్ పంప్ హౌజ్ నుంచి ఒక మోటార్ ద్వారా నాలుగు రోజుల నుంచి నిలిపి వేశామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా ప్రస్తుతం 17.8 అడుగులకు వచ్చి చేరింది. ఇంకా 14.7 అడుగుల నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది. ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడంతో ఆయకట్టు దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

దేవరకద్ర, జూలై 7 : ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఏంపీడీవో శ్రీనివాస్ రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనకు 2600 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జీరో కరెంటు బిల్లు, 500 గ్యాస్ సిలిండరు రాని వారు ఉంటే తమ దరఖాస్తులను, ప్రజాపాలన దరఖాస్తులను తీసుకొచ్చి ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

రాజాపూర్, జూలై 7 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నేడు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దర్ ఔవిద్యాసాగర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు చెక్కులు వచ్చినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

నేడు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం

- హాజరుకానున్న రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

పాలమూరు, జూలై 7 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండీడ్ నరసింహ, వాకిటి అశోక్, యం.గోపాల్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, పులిపలుపుల ఆనందం, ఆర్.వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, మోయాజ్, పరిపూర్ణం, యం.డి రఫీ, కె.అమృత్, యాదగిరి, ఏముల నరసింహ, పద్మనాభరావు, రఘునాథరావులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభ నిర్వహణ, రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, అక్రిడిటేషన్ కార్డుల సమస్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం, రైల్వే పాసులపై చర్చించనున్నట్లు తెలిపారు.

వాకింగ్ చేయండి.. ఆరోగ్యంగా ఉండండి

జడ్చర్ల, జూన్ 7 : ఉదయం వేళ వాకింగ్ చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఏగురు ఆసుపత్రి ఆధ్వర్యంలో వాకథాన్‌లో కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం వ్యాయామాలు చేయడానికి సమయం లేనివారు సంతోషంగా వాకింగ్ చేయవచ్చన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి తగినంత శారీరక శ్రమఅవసరమన్నారు. అందుకే చాలా మంది వాకింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నడక కారణంగా చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించాలి

జడ్చర్ల, జూలై 7 : ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఐద్వా నాయకురాలు వసియాబేగం డిమాండ్ చేశారు. బాదేపల్లి మార్కెట్ ప్రాంగణంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలని అలాగే సంక్షేమ వసతిగృహాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, మెనూ ప్రకారం భోజనం, నోట్‌బుక్స్, యూనిఫార్మ్ అందజేయాలని కోరారు. ఈ నెల 10వ తేదీ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జగన్, సంధ్యారాణి, లలిత, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి దేవాలయ పరిరక్షణ కమిటీ ఎన్నిక



జడ్చర్లలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో దేవాలయ పరిరక్షణ కమిటీని ఎన్నుకుంటున్న స్థానికులు

జడ్చర్ల, జూలై 7 : జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి పాతబజారు సమీపంలోని రంగనాయకులగుట్టపై ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవాలయ పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించుకుని 24 మంది సభ్యులతో కూడిన పరిరక్షణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో కాల్వరాంరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ఈటె శ్రీను, విక్కీ, నరేశ్, శివ, నరేశ్, రఘు, సంతూచారి, బాలుగౌడ్, శివకుమార్, మురళీకృష్ణ, భరత్‌గౌడ్, రఘువంశీగౌడ్, నరసింహముదిరాజ్, యాదగిరియాదవ్, శ్రీనివాస్, ఓర్సు నరేశ్, బాలరాజు, బాలరాజు, శంకర్, రాఘవేందర్, ప్రతాప్‌రెడ్డి, కిరణ్, బొమ్మల నాగార్జునతో కమిటీని ఎన్నుకున్నారు.

● నేడు జడ్చర్ల బంద్ : రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవాలయం ముందున్న కోనేరును పూడ్చివేసిన సంఘటనపై దేవాలయ పరిరక్షణ కమిటీ సభ్యులు ఈ నెల 8న జడ్చర్ల బంద్‌కు పిలుపునిచ్చారు. పట్టణంలోని హనుమాన్ దేవాలయం వద్దకు సోమవారం ఉదయం 9గంటలకు పట్టణ ప్రజలు, హిందూధార్మిక సంఘాల నాయకులు చేరుకోవాలని, ర్యాలీగా బంద్ నిర్వహిద్దామని పిలుపునిచ్చారు.